క్లుప్తంగా

సంకిలి సుగర్ ఫ్యాక్టరీలో 16న ముగియనున్న క్రషింగ్

సీతానగరం: సంకిలి ఈఐడీప్యారీస్ చక్కెర కర్మాగారంలో 2023–24 క్రషింగ్ సీజన్ 16వ తేదీన ముగియనుందని కర్మాగారం అసోసియేట్ వైస్‌ప్రెసిడెంట్ పట్టాభి రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. కర్మాగారంలో ఇంతవరకూ 3.72 లక్షల మెట్రిక్‌టన్నుల చెరకు క్రషింగ్ జరిగిందన్నారు. క్రషింగ్ ముగిసే సమయానికి 3.87 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ జరగనున్నట్లు చెప్పారు. 2023అక్టోబరు 31న క్రషింగ్ ప్రారంభించామని, కర్మాగారం పరిధిలో 2.90 లక్షలకు గాను బొబ్బిలి ప్రాంతం నుంచి 90.709 వేలు, భీమసింగి ద్వారా 6.632 మెట్రిక్ టన్నుల చెరకు వచ్చిందన్నారు. 2023–24 క్రషింగ్ సీజన్‌లో 9.24 రికవరీ శాతం వచ్చిందని తెలియజేశారు. పొలాల్లో ఇంకాఉన్న చెరకును ఈ నెల 16 లోగా కర్మాగారానికి తరలించాలని కోరారు.

వైభవంగా రామమందిరం ప్రారంభోత్సవం



రామమందిరం ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

సీతానగరం: మండలంలోని కాశీపేటలో నిర్మించిన రామమందిరం ప్రారంభ మహోత్సవాలు ఆలయ ప్రధాన అర్చకుడు కమలాకర్ శాస్త్రి ఆధ్వర్యంలో అర్చకబృందం వైభవంగా నిర్వహిస్తోంది. దేవాదాయ శాఖ ద్వారా మంజూరు చేసిన రూ. 40 లక్షలతో పాటు గ్రామస్తులు సమకూర్చిన లక్షల రూపాయల నిధులతో గ్రామ సర్పంచ్ తేలు ధనుంజయమ్మ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో రామమందిరాన్ని నిర్మించారు. పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడంతో గ్రామస్తులంతా సమన్వయంతో మందిర ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభించారు.

నూనె గింజల పంటకు తెగులు పట్ల అప్రమత్తం



మాట్లాడుతున్న ఎంఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలో నూనెగింజల పంటలను ఆశించే తెగుళ్ల పట్ల రైతులు మెలకువలు పాటించాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. ఈ మేరకు జాతీయ నూనె గింజల అభివృద్ధి పథకంలో భాగంగా మంగళవారం ఆయన మండలంలోని చినంకలాం గ్రామంలో వేరుశనగ పంటను పరిశీలించి పంటల అభివృద్ధికి తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు, అధిక దిగుబడిని సాధించడానికి అనుసరించాల్సిన మెలకువలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో క్లస్టర్ రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పాప పశ్చాత్తాప పాదయాత్ర



ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసును సత్కరిస్తున్న మతగురువులు

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి గ్రామం నుంచి, పనసభద్ర గ్రామం సమీపంలోని ఏసుక్రీస్తు పుణ్యక్షేత్రం వరకు మంగళవారం మత గురువులు, భక్తులు పాప పశ్చాత్తాప పాదయాత్ర నిర్వహించారు. పాప పశ్చాత్తాప పాదయాత్రలో మక్కువ, సాలూరు మండలాలకు చెందిన సుమారు 3వేల మంది క్రైస్తవ భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశాఖపట్నానికి చెందిన ఎక్సైజ్ సూపరింటెండెంట్ చింతగడ దాసు, బిషప్ పాలిమేర జయరాజులు హాజరయ్యారు. బిషప్ జయరాజు, పలువురు గురువులు పుణ్యక్షేత్రంలో వాక్యాన్ని భక్తులకు వినిపించారు. అనంతరం ఎక్సైజ్ సూపరింటెండెంట్ దాసును బిషప్ జయరాజు, ఫాదర్ జీవన బాబు దుశ్శాలువాలతో సత్కరించారు.

రక్తహీనతను అరికట్టాలి



వంతరాంలో గర్భిణులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమేష్‌నాయుడు

బలిజిపేట: మాతాశిశు మరణాల రేటుకు ప్రధాన కారణమైన రక్తహీనతను గుర్తించి తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ రమేష్‌నాయుడు తెలిపారు. ప్రిజం 10లో భాగంగా బలిజిపేట మండలంలోని వంతరాంలో గర్భిణులతో ఆయన మంగళవారం మాట్లాడారు. వైద్య, ఐసీడీఎస్ శాఖలు సమన్వయంతో రక్తహీనతను అరికట్టాలని పిలుపునిచ్చారు. తలనొప్పి తరచూ రావడం, నిద్ర పట్టకపోవడం, కళ్లు తిరగడం, గుండె వేగంగా కొట్టుకోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటే రక్తహీనత ఉన్నట్లేనని స్పష్టం చేశారు. ఈ లక్షణాలను గుర్తించి తగు వైద్యసేవలు అందించాలని సూచించారు. నిర్ధారించిన ప్రకారం అధికారులు వారంలో మూడుసార్లు వారిని పర్యవేక్షించి నివేదికలను అప్‌డేట్ చేయాలని సూచించారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



వార్షికోత్సవ సంబరాలు చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు



వైఎస్సార్ విగ్రహం వద్దకు పాదయాత్రగా వెళ్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు, తదితరులు

- ఎమ్మెల్యే జోగారావు ఆధ్వర్యంలో కార్యక్రమం
- భారీగా హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

పార్వతీపురంటౌన్: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ స్థాపించి నేటికీ 13 ఏళ్లు పూర్తి చేసుకుని 14వ ఏడాదిలోకి అడుగుపెట్టిన శుభసందర్భంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో నియోజకవర్గం పరిధిలో గల నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వందలాది మంది పార్టీ శ్రేణులతో కలిసి వైఎస్సార్ విగ్రహం వద్దకు పాదయాత్రగా వెళ్లి వైఎస్సార్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోరి దివంగత నేత రాజశేఖరరెడ్డి తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైస్సార్‌సీపీని స్థాపించి దేశ చరిత్రలోనే ఏ నాయకుడికీ సాధ్యం కాని రీతిలో పార్టీని అధికారంలోకి తీసుకువచ్చి ప్రజాసంక్షేమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. గత 58 నెలల పరిపాలన కాలంలో దేశానికే ఆదర్శ ప్రాయమైన పరిపాలనను అందించి దేశ చరిత్రలో నిలిచిపోయే విధంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలను తీసుకువచ్చి పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ రాష్ట్ర ప్రజలకు సుభిక్షమైన పాలనను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్నట్లు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుని ఈ ప్రజాసంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించేందుకు అందరం కృషి చేయాలని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు.

కేక్ కట్ చేసి సంబరాలు

అనంతరం ఎమ్మెల్యే జోగారావు అందరి సమక్షంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షుల చేతుల మీదుగా కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. జై జగన్, జై జోగారావు, జోహార్ వైఎస్‌ఆర్ అని పార్టీ కార్యకర్తలు నినాదాలు చేస్తూ ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, బొమ్మి రమేష్, బొంగు చిట్టిరాజు, పాలవలస మురళీకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, వైస్‌చైర్మన్‌లు కొండపల్లి రుక్మిణి, యిండుపూరు గున్నేశ్వర రావు, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, మామిడి బాబ్జీ, అలజంగి రవికుమార్, ఎంపీపీలు మజ్జి శోభారాణి, బలగ రమణమ్మ, గుడివాడ నాగమణి, ఏఎంసీ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్, సీనియర్ నాయకులు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి. కృష్ణమూర్తి, జనరల్ సెక్రెటరీ వెంపలి గురురాజు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్ సభ్యులు, స్టేట్ డైరెక్టర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం ఈశ్వరరావు

సీతానగరం: శిశుమరణాలు, మహిళల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో సమకూరుస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సీతానగరం మండలంలోని జోగింపేట, పెదభోగిలి పంచాయతీల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో సీడీపీఓ సుగుణ, ఎస్‌ఓ పూర్ణిమ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీలను ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశు మరణాలను నివారించడానికి అధికారులు అందరూ ప్రత్యేక దృష్టి సారించాలని, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి ప్రభుత్వం సమకూర్చిన పౌష్టికారాన్ని గర్భిణులు, బాలింతలు భుజిస్తున్నదీ లేనిదీ పరిశీలించాలని సూచించారు. మహిళల్లో ప్రధానంగా గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత ఎక్కువగా ఉన్నట్లు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా వైద్యరోగ్యశాఖ సిబ్బంది గుర్తించడం వల్ల అందరు అధికారులు సమష్టిగా పనిచేసి మహిళలు, శిశువుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించేలా చూడాలని కోరారు. గ్రామాల్లో వైద్యరోగ్యశాఖ, పంచాయతీ రాజ్ శాఖ అధికార సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి అవగాహన సదస్సులు నిర్వహించి మహిళలను చైతన్య పర్చాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్లు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలి

సాలూరు: వచ్చే సాధారణ ఎన్నికలు సజావుగా జరిగేందుకు అందరూ సహకరించాలని ఈఆర్‌ఓ, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సాలూరు తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియ తదితర అంశాల్లో నియమనిబంధనలను అధికారులకు వివరించారు. ఎన్నికల నియమావళిని అందరూ తప్పక పాటించాలని స్పష్టం చేశారు. నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వాహనాలు ఆర్‌ఓ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ఉంచాలని, వాహనాల భద్రతను పరిశీలించాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, పి.కోనవలస ఐటీడీఏ గెస్ట్‌హౌస్ పనులు పరిశీలించిన ఆయన పనులు త్వరగా పూర్తిచేయాలని నిర్వాహకులను ఆదేశించారు.

బుడ్డిపేటకు తీరిన సమస్యలు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి పంచాయతీ కొత్తబుడ్డిపేటలో గడప గడపకు మనప్రభుత్వం నిధులతో సీసీ రోడ్డు, సీసీ కాలువల నిర్మాణం పూర్తి కావచ్చినట్లు మండల పీఆర్ ఏఈ జి చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన పెదభోగిలి, రామవరం, సీతానగరం గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో సామాజికపరమైన అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రభుత్వం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో గుర్తించిన పనులు చేపట్టడానికి నిధులు మంజూరుచేసిందన్నారు. ఆయానిధులతో చేపడుతున్న పనులు ఇంజినీరింగ్ సహాయకుల పర్యవేక్షణలో జరుగుతున్నాయని తెలియజేశారు. నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్మాణాలు చేపట్టాలని లేనిపక్షంలో బిల్లుల చెల్లింపుల్లో కోత విధించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కొత్తబుడ్డిపేట గ్రామంలో జీజీఎంపీ నిధులు రూ.11,50 లక్షలతో సీసీ కాలువ, సీసీరోడ్డు నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు.

జగనన్న ఇంటిహక్కు పత్రాల అందజేత



మార్కొండపుట్టిలో లబ్ధిదారులకు ఇంటిహక్కు పత్రాలు అందిస్తున్న రంగునాయుడు

మక్కువ: మండలంలోని మక్కువ, మార్కొండపుట్టి పంచాయతీలకు చెందిన లబ్ధిదారులకు జగనన్న ఇంటి శాశ్వత హక్కుపత్రాలను మంగళవారం అందించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరై, లబ్ధిదారులకు ఇంటి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రంగునాయుడు మాట్లాడుతూ జగనన్న ఇళ్లు ఇకపై మీ ఆధీనంలో ఉంటాయని ధైర్యం చెప్పారు. ఇంటిపై అన్ని హక్కులను లబ్ధిదారులకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారన్నారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను సాకారం చేయాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఇంటిస్థలం అందించడంతోపాటు, ఇంటిని నిర్మించి అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఏప్రభుత్వాలూ పేదవానికోసం ఈ విధంగా ఆలోచన చేయలేదన్నారు. లబ్ధిపొందిన ప్రతి ఒక్కరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గుర్తుంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మండంగి భాగ్యలక్ష్మి, రెవెన్యూ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చిలకలపల్లిలో అభివృద్ధి చిందులు

- సచివాలయం పరిధిలో రూ.3.63కోట్లతో పనులు
- సంక్షేమ పథకాలతో ప్రజలకు అందిన లబ్ధి రూ.22.70కోట్లు



బలిజిపేట: మండలంలోని చిలకలపల్లి సచివాల యం పరిదిలో అభివృద్ధి, చిందులేస్తోంది. సచివాలయం పరిధిలో రూ.3.63కోట్లతో అభివృద్ధి పనులు జరగ్గా, ప్రజలకు అందిన సంక్షేమ పథకాల లబ్ధి 22.70కోట్ల వరకు ఉంది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్లు, వీధి కాలువలు, కల్వర్టులు, మంచినీటి ట్యాంకుల నిర్మాణం, జలజీవన్ మిషన్‌ద్వారా ఇంటింటి కుళాయి పథకం అమలు వంటి అభివృద్ధి పనులు నిర్వహించింది.

గ్రామంలో అభివృద్ధి పనులు

సచివాలయం పరిధిలో రూ.3.63కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. అందులో భాగంగా రూ.40లక్షలతో సచివాలయం భవనం, రైతుభరోసా కేంద్రం రూ.21.80లక్షలతో, వెల్‌నెస్‌సెంటర్‌కు రూ.14.95కోట్లు,



చిలకలపల్లి సచివాలయం

నాడు–నేడులో భాగంగా ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల పనులకు రూ.1.14కోట్లు, సీసీ రోడ్లు, కాలువలకు రూ.57లక్షలు, వాటర్ ట్యాంకు నిర్మాణాలకు రూ.30లక్షలు, జలజీవన్ మిషన్‌కు రూ.59లక్షలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు రూ.10లక్షలు ప్రభుత్వం ఖర్చు చేసింది.

నాన్ డీబీటీ పథకం కింద వివిధ రకాలుగా లబ్ధి

ఇళ్లస్థలాలు 194మందికి రూ.4,77,24,000, విద్యాకానుక కిట్లు 203మందికి రూ.14,41,706, ట్యాబ్‌లు 19మందికి రూ.2,51,218, జగనన్న తోడు(రుణాలు) 149 మందికి రూ.27,74,231, జగనన్న గోరుముద్ద 192మందికి రూ.19,02,144, సంపూర్ణ పోషణకింద 127మందికి రూ.23,78,710. ఇంటింటికీ రేషన్–79.80లక్షల మిలియన్ టన్నుల బియ్యం, వైఎస్సార్ కంటి వెలుగులో 676మందికి రూ.1,47,66,544లు ప్రభుత్వం వెచ్చించింది.



ఇంటింటి కుళాయిలు



రైతు భరోసా కేంద్రం



నాడు-నేడు పనులతో నిర్మించిన పాఠశాల



కొత్తవీధిలో సీసీ రోడ్డు

గ్రామంలో ఎంతో అభివృద్ధి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి ఎంతో జరిగింది. పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదలకు సంక్షేమం అందించారు. నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతోంది. ఈ ప్రభుత్వమే మళ్లీ రావాలి.

ఎ.సుందరరావు, సర్పంచ్, చిలకలపల్లి

ఇది పేదల ప్రభుత్వం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలది. కూడు, గూడు లేనివారికి, నిరుపేదలకు అండగా ఉండి సంక్షేమాన్ని అందిస్తూ ప్రభుత్వం కంటికి రెప్పలా కాపాడుతోంది. ఏప్రభుత్వం చేయని సంక్షేమాన్ని అమలు చేస్తోంది.

ఎ.రవికుమార్, జెడ్పీటీసీ, చిలకలపల్లి

బూత్ కమిటీ సభ్యులే కీలకం

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

పార్వతీపురంటౌన్: 2024 సాధారణ ఎన్నికల్లో బూత్ కమిటీ సభ్యులే కీలకమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు పురపాలక సంఘంలోని 19వ వార్డు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో ఎలా ముందుకు వెళ్లాలి? వైఎస్సార్‌సీపీకి అత్యధిక పోలింగ్ ఎలా నమోదు చేయాలన్న అంశాలపై అందరికీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ పరిధిలో గల ప్రతి ఒక్క ఓటర్‌నూ మనం నేరుగా కలుసుకుని మన జగనన్న ప్రభుత్వం వారికి చేసిన మేలును తెలియజేయాలని కోరారు. మన భవిష్యత్ మరింత బాగుండాల న్నా, సంక్షేమం, అభివృద్ధి పథకాలు మున్ముందు కొనసాగాలన్నా, అందరూ తప్పక వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతుగా నిలిచి మన ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ పార్టీ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవి కుమార్, కౌన్సిలర్ తెలుగు బోదయ్య, ఆశపు సర్వేశ్వరరావు, చందక సూర్యప్రకాశ్, కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు, గృహ సారథులు తదితరులు పాల్గొన్నారు.

జేఏఎస్–2 వైద్యశిబిరాలను వినియోగించు కోవాలి

- డీఎంహెచ్ఓ బి.జగన్నాథరావు



వైద్యసేవల గురించి డాక్టర్లతో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ జగన్నాథరావు

సీతానగరం: జిల్లా వ్యాప్తంగా సచివాలయాలపరిధిలో నిర్వహిస్తున్న జగనన్నఆరోగ్య సురక్ష (జేఏఎస్–2) వైద్య శిబిరాలను వ్యాధిగ్రస్తులంతా సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్.బి జగన్నాథరావు కోరారు. ఈ మేరకు సీతానగరం పీహెచ్‌సీ పరిధిలోని గుచ్చిమిలో డాక్టర్ బి.పావని, సర్పంచ్ బి శ్రీదేవి, ఎంపీటీసీ సీహెచ్ జగదీశ్వరనాయుడుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జేఏఎస్–2 వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు.

ఈ సందర్భంగా ఉచితవైద్య శిబిరం ఆవరణలో ఏర్పాట్లు, మందులిచ్చే కౌంటర్లు, రోగులకు అందిస్తున్న వైద్యసేవలను, పరిశీలించారు. అలాగే ఎటువంటి వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులు ఎలా వస్తున్నారో తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన రోగుల వివరాలపై సచివాలయ సిబ్బంది చేస్తున్న రిజిస్ట్రేషన్, టోకెన్లు జారీ, నిర్వహించిన పరీక్షలు, ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అక్కడ వైద్యసేవలు వినియోగించుకోడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి ఆరోగ్యస్థితిని తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు డాక్టర్ స్వరూప్, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ రాజేంద్ర, స్థానిక డాక్టర్ నిహారికా, డాక్టర్ కె.రమేష్, సీహెచ్ఓ ఎస్వీ రమణ, సూపర్‌వైజర్లు శర్మ, భవాని, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి



నిడగల్లులో మాట్లాడుతున్న డ్వామా పీడీ కె.రామచంద్రరావు

సీతానగరం: పదోతరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి వీలుగా విద్యార్థులకు బోధనా తరగతులు నిర్వహించాలని జిల్లా జలయాజమాన్య సంస్థ పీడీ కె. రామచంద్రరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన నిడగల్లు ఉన్నత పాఠశాలలో 10 వతరగతి విద్యార్థుల విద్యా సామర్థ్యంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలు సమీపించడంతో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే జోగింపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయంలో ఎంపీడీఓ ఎం ఈశ్వరరావు పదోతరగతి విద్యార్థులు, స్కూల్ అసిస్టెంట్‌లతో మాట్లాడి టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధనకు కృషి చేయాలని సూచించారు. బూర్జ ఉన్నత పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో పాల్గొనే విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు శ్రద్ధతీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి బి సత్యనారాయణ పిలుపునిచ్చారు. జోగింపేట కేజీబీవీలో ఎంఈఓ జి.సూరిదేముడు విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి ఓటువేయండి

- ఎమ్మెల్యే జోగారావు



నూతన బీటీ రోడ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం చూసి వైఎస్సార్‌సీపీకి ఓటువేయాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని చెల్లెంపేట నుంచి తుమరాడ జంక్షన్ వరకు 2.2కిలోమీటర్ల పొడవునా రూ.1.35కోట్లతో నిర్మించిన, చెల్లెంపేట నుంచి అరసాడ జంక్షన్ వరకు 850మీటర్ల పొడవునా రూ.1.01కోట్లతో నిర్మించిన బీటీరోడ్లను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చూడని అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిందని చెప్పారు. ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని దీనిని ప్రజలు గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.శ్రీనివాసరావు, మండల సచివాలయ కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరు నాయుడు, వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, వైఎస్సార్‌సీపీ మండల మహిళా సంఘం అధ్యక్షురాలు దుర్గేశ్వరి, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

2024 ఎన్నికల్లో సమన్వయంతో పని చేద్దాం

సీతానగరం: వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించడానికి అందరూ సమన్వయంతో పని చేయాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీతానగరం మండలంలోని పెదభోగిలిలో మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఇజ్జాడ సింహాచలం నివాసాల్లో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగారావు మాట్లాడుతూ 5 సంవత్సరాల తన పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమపథకాలు అమలయ్యేలా సేవలందించిన సీఎం జగనన్నను 2024 సార్వత్రిక ఎన్నికల్లో అందరం కలిసి కట్టుగాపనిచేసి ముఖ్యమంత్రిని చేయడానికి పనిచేద్దామని పిలుపునిచ్చారు. అందుకు మాజీ ఎమ్మెల్యే సవరపు జయమణి, ఇజ్జాడ సింహాచలంతో పార్టీ అభివృద్ధికి చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నానారావు, రాంబాబు, లక్ష్మణరావు, కె శ్రీనివాసరావు, పార్థసారథి, సవరపు రామారావు, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, పి ఈశ్వర నారాయణ, సీడీసీ మాజీ చైర్మన్ ఎస్ రామకృష్ణ, అరకు పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కార్యదర్శి వెంపలి గుర్రాజు, సచివాలయ కన్వీనర్ కిరణ్‌కుమార్, డి దేవదానం, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు పోల సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు, మాజీ ఎమ్మెల్యే జయమణి